క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



రాజాం: మారేడుబాకలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ బుధవారం జరిగింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు కార్డులు అందించారు. అనంతరం ఈ కార్డు ద్వారా రూ.25 లక్షల విలువైన వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చని వివరించారు.

రాజాం: మండలంలోని మారేడుబాక గ్రామంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ బుధవారం చేపట్టారు. వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ చేతులమీదుగా వీటిని పలువురు లబ్ధిదారులకు అందించారు.

బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రామఅప్పలనాయుడు

రాజాం సిటీ: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా జె.రామఅప్పలనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు, ఆర్‌ఐ చక్రవర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టీఎంసీ ఎస్‌వీ రత్నం పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన పట్టణంలోని పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

బడ్జెట్ ఆమోదం



బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: మున్సిపాలిటీకి సంబంధించి, 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో వివిధ రంగాలకు కేటాయించిన నిధులు, అయ్యే ఖర్చు వివరాలను చైర్మన్ ప్రతిపాదించారు. దీనికి కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మేదరిబంద వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల అద్దె విషయమై జరగాల్సిన చర్చను వాయిదా వేశారు.

పంటరుణాలను రెన్యువల్ చేసుకోండి

రేగిడి: పంటరుణాలను రెన్యువల్ చేసుకోవాలని రేగిడి కో–ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ వంజరాపు అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోగా 7 శాతం వడ్డీతో రుణాలను రైతులు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. గడువు దాటిన తర్వాత తీసుకున్న రుణంతో పాటు 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. రెన్యువల్‌కు ఆధార్‌కార్డు, 1బి, మొబైల్ నంబర్‌తో సొసైటీ కార్యాలయానికి రైతులు రావాలని సీఈవో బెవర గోవిందరావు తెలిపారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో పుట్టలో వెలసిన అయ్యప్పస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇక్కడి అయ్యప్పస్వామికి కొత్తగా ఆలయం నిర్మించి, ప్రతీ బుధవారం పూజలు, అభిషేకాలతో పాటు అన్నసమారాధన చేపడుతున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబుశర్మ, రేజేటి వంశీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో బొబ్బిలి జట్టు ప్రతిభ



జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

బొబ్బిలి: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన జట్టు విశేష ప్రతిభ కనబరిచింది. బుధవారం సెమీఫైనల్స్, ఫైనల్స్ జరగ్గా, బొబ్బిలి జట్టు మూడో స్థానంలో నిలిచింది. కోచ్ అపర్ణబాబా సలహాలు, సూచనలతో జట్టు సభ్యులు బాగా రాణించారని పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



కార్యక్రమానికి హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

బొబ్బిలి: మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధుల విడుదల సంబరాల్లో బొబ్బిలి రూరల్, బొబ్బిలి టౌన్ పొదుపు సంఘాల సభ్యులు(స్వయం సహాయక సంఘాల సభ్యులు)కు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బొబ్బిలి మండలంలోని 1350 సంఘాల్లోని 14,658 మంది సభ్యులకు సంబంధించి, రూ.8,02,14,261 చెక్కు, బొబ్బిలి పట్టణంలోని 965 సంఘాల్లోని 10,107 మంది సభ్యులకు సంబంధించి, రూ.5,91,72,222 చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆయన ఆ దిశగా ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్ని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రభుత్వం విడుదల చేసిన నిధులు మహిళలకు ఎంతో మేలు చేశాయన్నారు. చాలామంది ఈ సొమ్మును సద్వినియోగం చేసుకుని, ఉపాధి బాట పట్టి, కుటుంబానికి అండగా నిలిచారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని నెరవేర్చడంతో పాటు సదస్సులు, సమావేశాలు, కార్యక్రమాల్లో ఇచ్చిన ఎన్నో హామీలను సీఎం జగనన్న నెరవేర్చారన్నారు. గతంలో టీడీపీ హయాంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తాం.. బ్యాంకుల్లో తాకట్టుపెట్టిన బంగారం విడిపిస్తామని ఆ పార్టీ చెప్పి, అవేమీ చేయకుండా మహిళలను మోసం చేసిందని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాల అమలు జరుగుతోందని వివరించారు. రైతుల కోసం రైతు భరోసా పథకం, చదువుకుంటున్న పిల్లలకు అమ్మఒడి పథకం, విదేశాల్లో చదువుకోవాలనుకునే పేద విద్యార్థులకు విదేశీ విద్యాదీవెన, మహిళలకు ఆసరా, చేయూత పథకాలు తోడ్పాటునందిస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజలందరికీ మంచి జరగాలంటే రానున్న ఎన్నికల్లోనూ తప్పనిసరిగా వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు లబ్ధిదారులంతా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్ గొలగాన రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావెల్లి అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్య



మాట్లాడుతున్న ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్య

రామభద్రపురం: విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ అమ్మఒడి మొదలుకుని, విద్యాకానుక, గోరుముద్ద, సీబీఎస్సీ సిలబస్, ఇంగ్లిష్ మీడియం, మిర్రర్ ఇమేజ్ పాఠ్యపుస్తకాలు ఇలా ఎన్నో పథకాలు, కార్యక్రమాలు తీసుకువచ్చి, పేదపిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల చదువు తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రభుత్వమే చూసుకుంటోందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో మండలంలోని లబ్ధిదారులకు వివిధ పథకాల కింద రూ.141.11 కోట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ప్రభుత్వం అందజేసిందన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటుతోనే ఇప్పుడు ఎంతో మంది పేదలు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపిస్తుండడం చాలాచోట్ల కనిపిస్తోందన్నారు.

ఈ–క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనం



నాయరాలవలసలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: ఈ–క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనమని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని నాయరాలవలస, లచ్చన్నవలస, జాడాపేట గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదుపై బుధవారం అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో సాగు చేస్తున్న మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర తదితర పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

విపత్తుల కారణంగా పంటనష్టం జరిగితే నష్టపరిహారం పొందేందుకు, పంట సులభంగా విక్రయించుకునేందుకు ఈ–క్రాప్ నమోదు ఉపయోగపడుతుందన్నారు. మండలంలో 2,950 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తయిందన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



మద్దతు తెలిపి, డాక్టర్ రాజేష్‌ను సత్కరిస్తున్న గురవాం గ్రామస్తులు

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మరోసారి మద్దతు ఇచ్చి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. మండలంలోని గురవాం గ్రామంలో పార్టీ నాయకులు, పలు ప్రజాసంఘాల నేతలు, రిటైర్డ్ ఉద్యోగులను బుధవారం కలిసి, పార్టీ గెలుపుతో పాటు తన విజయానికి కూడా పూర్తిస్థాయి సహకారం అందించాలన్నారు. అనంతరం ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగనన్న రాష్ట్రంలో అవినీతిరహిత పాలన కొనసాగిస్తున్నారని, ఆయన ప్రవేశపెడుతున్న పాలనా విధానాలు, పరిపాలనలో ఆయన తీసుకువస్తున్న సంస్కరణలు దేశానికే ఆదర్శమన్నారు. పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం రాజేష్‌ను గ్రామస్తులు సత్కరించి, మద్దతు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, సర్పంచ్ రమణమ్మ తదితరులు ఉన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని బాలకవివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంఈవో ఎంవీ ప్రసాదరావు బుధవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం రూ.47 వేలు మంజూరు చేయగా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి రూ.10 వేలు, ఉపాధ్యాయుడు సిరిపురపు గణపతి రూ.5 వేలను విరాళంగా అందించినట్లు ఎంఈవో పేర్కొని, దాతలను అభినందించారు.



నాడు–నేడు పనులపై ఆరాతీస్తున్న తలే రాజేష్

రాజాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు)లో జరుగుతున్న నాడు–నేడు పనులను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, మరుగుదొడ్ల ఏర్పాటును చూసి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జగదీష్ వద్ద వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అవకాశాలను తెలిపారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 మద్యంసీసాలు స్వాధీనం

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురం జంక్షన్‌లో అక్రమంగా తరలిస్తున్న 15 మద్యంసీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఏఎస్‌ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి, తాటిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కులగణనను వేగవంతం చేయాలి



వంగర: కులగణనపై ఆరాతీస్తున్న ఎంపీడీవో త్రినాథ్

వంగర: కులగణనను వేగవంతం చేయాలని ఎంపీడీవో లోపింటి త్రినాథ్ సూచించారు. మండలంలోని మగ్గూరు సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి, కులగణన సర్వేపై సిబ్బందితో సమీక్షించారు. ఎంతమేర సర్వే జరిగింది.. ఇంకెంత మేర సర్వే చేయాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా సర్వే పూర్తి చేయాలని తెలిపారు.

బాడంగి: మండలంలో కులగణన సర్వే 92 శాతం మేర పూర్తయినట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. మండలంలోని కోటిపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చాలా చురుగ్గా జరుగుతోందని, రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తికి సిబ్బందిని ఆదేశించామన్నారు. మండలంలో మొత్తం 15,600 కుటుంబాలు ఉండగా, 14,350 కుటుంబాల వరకు సర్వే పూర్తయిందన్నారు. సిటిజన్ సర్వే కూడా త్వరితగతిన జరుగుతోందన్నారు. ఆయన వెంట కార్యదర్శి టి.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు చేపట్టాలని, ఈ విధానం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం జీవామృతం తయారీ, దాని వినియోగం, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల తయారీ యూనిట్ ప్రారంభం



బ్యాగుల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని మల్లంపేటలో డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటైన బ్యాగుల తయారీ యూనిట్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి సాధించి, తద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, మెప్మా పట్టణ అధ్యక్షురాలు తూముల బంగారురాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు తెంటు శివ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంఈవో త్రినాథరావు సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5ను బుధవారం సందర్శించిన ఆయన అక్కడి ప్రీస్కూల్ పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న విద్య, భోజనం వంటివి పరిశీలించారు. ప్రతిరోజూ కేంద్రానికి వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవికి తెలిపారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

బొబ్బిలి: విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలు వారికి గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇక్కడి మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు జీవీఎంసీ(గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్)కు బదిలీ కాగా, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయనను బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, మున్సిపల్ కమిషనర్ సేవలను ప్రశంసించారు. ఇక్కడ బాగా పనిచేసినట్టే అక్కడ కూడా బాగా పనిచేసి, మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో శ్రీరామ ధర్మక్షేత్రంలో బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక దివ్య మహాసభకు హాజరైన ఆయన చెట్లు ఇతరులకు ఫలాలు ఇస్తూ ఉపయోగపడుతున్నట్లే మానవులు కూడా ఇతరులకు సాయం చేస్తూ ఉపయోగపడాలన్నారు. కార్యక్రమంలో వారణాసి జగన్నాథరావు, గొర్లె దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ విడిపించాలి

బాడంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తెర్లాం ఎంఎల్‌ఎస్ పాయింట్ సీఎస్‌డీటీ స్వర్ణలత బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో డీడీలు చెల్లించి, రేషన్ సరుకులు విడిపించుకోవాలని సూచించారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని, మిగులు నిత్యావసర సరుకులను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

జోరుగా ఉపాధి పనులు

బాడంగి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని ఆకులకట్ట కోమటిచెరువు వద్ద జరుగుతున్న ఈ పనులను ఎంపీడీవో ఆంజనేయులు బుధవారం పరిశీలించి, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. పనికి వచ్చిన వారికే మస్తరు వేయాలన్నారు.